ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 6 సెప్టెంబరు 2025





విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సంస్కృత టీచర్ బౌరోతు శంకరరావు, కొమరాడ ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు

ఉపాధ్యాయ వృత్తిలో గొప్ప సంతృప్తి

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

పార్వతీపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిలో గొప్ప సంతృప్తి ఉంటుందని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. జిల్లా కేంద్రం పార్వతీపురం లయన్స్ క్లబ్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంత్రితోపాటు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి సంధ్యారాణి.. చిన్నారుల భవిష్యత్తును బంగారుబాటగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు సమాజంలో ఎంతో గౌరవం ఉందన్నారు. గురువులు చూపిన మార్గంలో విద్యార్థులు నడుస్తారన్నారు. 'నేను, ప్రభుత్వ విప్ జగదీశ్వరి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఒకప్పుడు ఉపాధ్యాయులమే. పిల్లలకు పాఠాలు బోధిస్తూ వారిని కను సైగలతో క్రమశిక్షణలో ఉంచగలిగిదే ఒక్క గురువులే. పార్వతీపురానికి ప్రభుత్వం వైద్య కళాశాలను మంజూరు చేసింది. దీనివల్ల త్వరలోనే ఏఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులకు ప్రత్యేక కళాశాలలు వస్తాయి. ఇంజనీరింగ్ కళాశాల పనులను త్వరలోనే పూర్తిచేస్తాం. పదో తరగతి ఫలితాల్లో మూడు పర్యాయాలు రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా మొదటి స్థానం సాధించిందంటే అది ఉపాధ్యాయులు కృషి వల్లనే సాధ్యమైంది. మీడియా సంస్థలు వాస్తవాలు తెలుసుకొని వార్తలు ప్రచురించాలి. లేకపోతే ఎంతోమంది ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటుంది. మెగా డీఎస్సీ ద్వారా కొత్త ఉపాధ్యాయులు వస్తున్నారు. పిల్లలకు పాఠాలతో పాటు విలువలు నేర్పించాలి. రక్త సంబంధాలు, అనురాగాలు వివరించాలి.' అని మంత్రి ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ జగదీ శ్వరి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఒక స్థాయిలో ఉన్నారంటే దానికి ఉపాధ్యాయులే కారణమన్నారు. ప్రస్తుతం క్రమశిక్షణతో కూడిన విద్యను బోధిస్తున్నారన్నారు. విద్యార్థులకు మంచి అలవాట్లు నేర్పించాలని

- మిగతా 8వ పేజీలో..



ఉపాధ్యాయుడికి అవార్డు అందిస్తున్న మంత్రి సంధ్యారాణి, చిత్రంలో ప్రభుత్వ విప్ జగదీశ్వరి, ఎమ్మెల్యే విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



శాంతి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయచంద్ర, ముస్లింలు

ఘనంగా మిలాద్ ఉన్ నబి

పార్వతీపురంటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్రం పార్వతీపురంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబి వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు సయ్యిద్ ఇబ్రహీం హుస్సేన్ ఆధ్వర్యంలో పాలకొండ రోడ్డులోని జామియా మసీదు నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొని మాట్లాడారు. మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుతున్నానన్నారు. ప్రవక్త సూచించిన విధంగా ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో పయనించాలన్నారు. అనంతరం జామియా మసీదు గురువు షరీఫ్ రబ్బానీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మైనార్టీ సంఘ నాయకులు రజాక్, సఫీ, జలాల్, ఫిరోజ్, బ్బాజానీ, తదితరులు పాల్గొన్నారు.

కొండను కొల్లగొట్టి.. ప్రజారోగ్యాన్ని గుల్లచేసి!



- బడిదేవరకొండపై ఆగని తవ్వకాలు
- చెరువులు, పంటపొలాల్లోకి గ్రానైట్ పొడి
- గిరిజనుల ఆరోగ్యంపై ప్రభావం
- ఇటీవల వెలగవలస చెరువులో జారి పడి ఒకరి మృతి
- ఆ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్నా.. స్పందించని అటవీశాఖ



గ్రానైట్ తవ్వకాలు జరిగిన ప్రాంతంలో చెరువుల పరిస్థితి ఇది

పార్వతీపురం, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలం బడిదేవరకొండ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం వద్ద గ్రానైట్ తవ్వకాలు ఆగడం లేదు. కొండను పిండి చేస్తూ.. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. మరోవైపు కోట్లాది రూపాయల గ్రానైట్‌ను యథేచ్ఛగా తరలిస్తున్నా.. అటవీశాఖాధికారులు స్పందించడం లేదు. ఇప్పటికీ వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించకపోవడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు ఏడు నెలలు గడుస్తున్నా కోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేయకపోవడంపై ఆ ప్రాంతవాసులు మండిపడుతున్నారు. కాగా గ్రానైట్ తవ్వకాల వెనుక ఇతర జిల్లాలకు చెందిన కొంతమంది ప్రభుత్వ

- మిగతా 8వ పేజీలో..



ఆరోగ్యానికి భరోసా

6 లో

- యూనివర్సల్ హెల్త్ పాలసీని తీసుకొచ్చిన ప్రభుత్వం
- రూ.25 లక్షల బీమా వర్తింపు



చెరుకుపల్లి వద్ద వరినాట్లు వేస్తున్న రైతు కూలీలు

94 శాతం పూర్తి

- జిల్లాలో జోరుగా సాగుతున్న వరినాట్లు

సాలూరు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే 94 శాతం పూర్తయినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం కంటే అధికంగా వరి సాగయ్యే అవకాశాలున్నాయని తెలియజేస్తున్నారు. కాగా గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ పంటలకు ఊపిరిపోశాయి. దీంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. మన్యంలో మొత్తంగా 1,78,423 ఎకరాల్లో వరి సాగవుతుండగా.. ఇప్పటి వరకు 1,68,153 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయి.

పూర్తయిన నాట్లు
గతేడాదితో పోలిస్తే (ఎకరాల్లో)

మండలం	గతేడాది	ఈ ఏడాదిలో..
సాలూరు	6,890	6,983
బలిజిపేట	17,430	17,425
సీతంపేట	7040	6631
సీతానగరం	16,368	15,250
వీరఘట్టం	17,100	15,551
గుమ్మలక్ష్మీపురం	5863	6309
గరుగుబిల్లి	15,435	13,280
భామిని	9090	8076
జియ్యమ్మవలస	15,043	13,448
కొమరాడ	11,395	11,035
కురుపాం	8200	5943
పాచిపెంట	3313	3018
మక్కువ	12,568	10,291
పాలకొండ	15,445	14,978
పార్వతీపురం	17,335	19,938



ట్రాక్టర్ నుంచి నారు దించుతున్న దృశ్యం

నారు తెచ్చి.. నాట్లు వేసి

భామిని, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుకుడి గ్రామంలో పలువురు రైతులు ఇతర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లలో నారు తీసుకువచ్చి శుక్రవారం నాట్లు వేశారు. వర్షాభావం కారణంగా తమ వరి నారు ఎండిపోయిందని, అయితే, ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు చేరడంతో ఇతర ప్రాంతాల నుంచి నారును గ్రామానికి తీసుకువచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఆలస్యమైనా సుమారు పది ఎకరాలు నాటేందుకు సిద్ధమైనట్లు బోదెపు అప్పలనాయుడు, రామినాయుడు పేర్కొన్నారు.



రోగులకు మెరుగైన
వైద్య సేవలందించాలి

6 లో

- మందుల కొరత లేకుండా చూడాలి
- సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్

ఇది తగునా?

- గిరిజన విద్యార్థులతో పనులు
- వంటలు, వడ్డింపులు వారితోనే
- అటకెక్కుతున్న చదువులు
- పట్టించుకోని అధికారులు

సీతంపేట రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులతో సిబ్బంది వెట్టిచాకిరీ చేయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వంట పనులతో పాటు తోటి విద్యార్థులకు వడ్డించడం, ఇతర పనులను వారితోనే చేస్తున్నారు. గిరిజన విద్యార్థుల యోగక్షేమాలు, మెనూ అమలు, ఆరోగ్య పరిరక్షణ, విద్యా ప్రమాణాల స్థాయి వంటి వాటిపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు ఉన్నాయి. కొద్ది రోజుల కిందట కురిసిన వర్షాలకు సీతంపేట ఏపీఆర్ గురుకుల పాఠశాల మైదానంలోకి మురుగునీరు చేరింది. దీంతో పాఠశాల సిబ్బంది పట్టించుకోకపోగా విద్యార్థినులకు పలుగు, పార ఇచ్చి మురుగునీటికి అడ్డుకట్ట వేసే పనులు చేయించారు. ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో ఇటీవల 85మంది నాల్గో తరగతి ఉద్యోగులను పొరుగుసేవల ప్రాతిపదికన నియమించారు. అన్ని పాఠశాలలకు వీరిని అవసరం మేరకు కేటాయించారు. అయినప్పటికీ ఆయా పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులతో వంట, వడ్డింపు వంటి పనులను చేయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



తోటి విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న గిరిజన విద్యార్థులు

మెనూకు తూట్లు..

ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలుకావడం లేదు. వారంలో రెండు రోజులు ఒక్కో

- మిగతా 8వ పేజీలో..

అన్న హత్య

- నలుగురిలో అవమానిస్తున్నాడని కక్షగట్టిన తమ్ముడు
- నిందితుల అరెస్టు

7 లో

రేపు ఫారెస్టు బీట్ ఆఫీసర్ల రాత పరీక్ష

- పక్కాగా ఏర్పాట్లు చేయాలి
- డీఆర్‌వో శ్రీనివాసమూర్తి



మాట్లాడుతున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్ల రాత పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని డీఆర్‌వో శ్రీనివాసమూర్తి ఆదేశించారు. పరీక్షలు నిర్వహణపై కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆదివారం రోజు ఉదయం జరిగే బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ల రాత పరీక్షకు 6308 మంది, మధ్యాహ్నం జరిగే సెక్షన్ ఆఫీసర్ల పరీక్షకు 910 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. విజయనగరంలో మొత్తం 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులను గంట ముందు కేంద్రాల్లోకి అనుతించాలని తెలిపారు. ప్రాథమిక వైద్య శిబిరాలు, తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని చెప్పారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ బాబురావు, సెక్షన్ ఆఫీసర్ ప్రసాద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కరరావు ఉన్నారు.



నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

శోభాయమానంగా..

- ఏలాం వినాయక శోభాయాత్ర

పాలకొండ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అతి పెద్ద మట్టి వినాయకుని శోభాయాత్ర ఘనంగా జరిగింది. పాలకొండలోని ఏలాం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన 18 అడుగుల వినాయక మట్టి విగ్రహాన్ని ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లా కొండలరావు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిమజ్జనానికి తరలించారు. ఏలాం జంక్షన్ నుంచి ప్రధాన రహదారి గుండా వినాయకుని శోభాయాత్ర సాగింది. పాలకొండ-రాజాం ప్రధాన రహదారిలోని నాగావళి నదిలో నిమజ్జనం చేశారు. శోభాయాత్రను తిలకించేందుకు పాలకొండ పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో డీఎస్పీ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో సీఐ చం ద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.



ఆకట్టుకున్న కాళీకా నృత్య ప్రదర్శన


ఆరోగ్యానికి భరోసా

- యూనివర్సల్ హెల్త్ పాలసీని తీసుకొచ్చిన ప్రభుత్వం
- రూ.25 లక్షల బీమా వర్తింపు
- 3,257 వ్యాధులకు చికిత్స
- ప్రతి కుటుంబానికీ లబ్ధి
- అందనున్న కార్పొరేట్ వైద్యం





● లక్కవరపుకోట మండలానికి చెందిన వెంకటరావుది నిరుపేద కుటుంబం. భార్య ఇద్దరి పిల్లలతో కాయ కష్టం చేసుకుంటూ హాయిగా జీవిస్తున్నాడు. పిల్లలిద్దరిని బాగా చదివించేందుకు రూపాయి, రూపాయి కూడబెట్టాడు. రూ.నాలుగైదు లక్షల వరకు పోగు చేశాడు. ఇంతలో అనుకోని ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. ఆపరేషన్ చేస్తే తప్ప ప్రాణాలు దక్కవని వైద్యులు పేర్కొన్నారు. దీంతో కూడబెట్టిన సొమ్మంతా ఖర్చెట్టవలసి వచ్చింది. పిల్లలకు ఖరీదైన చదువు చెప్పించేందుకు డబ్బులు లేకపోవడమే కాదు.. కుటుంబ జీవనం కూడా గగనమవుతోంది.



శృంగవరపుకోట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇలాంటి కుటుంబాలు లెక్కలేనన్ని ఉన్నాయి. ఏమాత్రం ఆరోగ్యం బాగోలేపోయినా ప్రాణాల మీద ఆశను వదిలేసుకోవాల్సి వస్తుంది. కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేక, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నయమవుతుందో లేదో నమ్మకం లేక చాలామంది సతమతమవుతున్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనివర్సల్ హెల్త్ పాలసీతో ఇలాంటి వారి కష్టాలన్నీ తీరనున్నాయి. ఈ పాలసీతో పేద, మధ్య తరగతి ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రి మెట్లు ఎక్కేందుకు అవకాశం కలగనుంది. ప్రతి కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్య బీమా వర్తించేలా గురువారం రాష్ట్ర కేబినెట్ ఆమోదించింది. ఈ సొమ్ముతో 3,257 చికిత్సలు ఉచితంగా పొందేందుకు అవకాశం కలుగుతుంది. ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా జిల్లాలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్య బీమా దక్కనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా రూ.2.50లక్షలు, కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5లక్షలు వైద్య ఖర్చులకు అందిస్తుంది. ఒక కుటుంబం ఒక ఏడాదికి వైద్యఖర్చులు చేసుకునేందుకు అమల్లో ఉంది. ఇప్పుడు ఇంతకు మించి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చింది. ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వైద్య సేవలన్నీ దారిద్ర్యరేఖకు దిగువనున్న (బీపీఎల్) కుటుంబాలకు మాత్రమే అందేవి. ఇవి కూడా కొన్ని రకాల వ్యాధులకు మాత్రమే చికిత్సలు జరుగుతున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన యూనివర్సల్ హెల్త్ పాలసీలో దాదాపు అన్నిరకాల చికిత్సలు ఉన్నాయి ఇంతవరకు ఉచిత వైద్య సేవలు అందుబాటులో లేని దారిద్ర్యరేఖకు ఎగువనున్న(ఏపీఎల్) కుటుంబాలు బీమా కల్పించారు. వర్కింగ్ జర్నలిస్టులను ఇందులో చేర్చారు. ఇప్పుడు బీపీఎల్, ఏపీఎల్ అనే భేదం లేకుండా అన్ని వర్గాలకు ఈ యూనివర్సల్ హెల్త్ పాలసీని వర్తింపచేశారు.

ఆరు గంటల్లోనే వర్తింపు..

సాధారణ జ్వరంతో ఆసుపత్రికి వెళ్తే డాక్టర్ ఫీజు, మందులు, రక్త పరీక్షలతో కనీసం రూ.5వేలైన చేతుచమురు వదులుతుంది. ఇక ఆపరేషన్‌లకైతే రూ.లక్షల్లో ఖర్చు. ఆసుపత్రిలో ఉండేందుకు ఇచ్చే గదికి రోజుకు రూ.3వేల నుంచి రూ.10వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. అన్ని వసతులు ఉన్న కార్పొరేట్ ఆసుపత్రుల్లో గది అద్దె వింటేనే గుండె పోటు వచ్చేస్తుంది. ఆరోగ్యం బాగోలేదని వెళ్లిన వారికి నాడిపట్టుకోకుండానే పరీక్ష చేసే వైద్యానికి పట్టణాల్లో అయితే రూ.500 నుంచి రూ.1000, నగరాల్లో అయితే ప్రస్తుతం రూ.800 నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారు. రోగితో మాట్లాడిన తరువాత చీటీపై రాసిన పరీక్షలకు రూ.5వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు. వ్యాధి నిర్ధారణ తరువాత అయ్యే ఖర్చు మాటల్లో చెప్పలేనంత. ఇలాంటి పరిస్థితిలో పేద, మధ్య తరగతి ప్రజలు మెరుగైన వైద్య చేయించుకోలేక మంచం పడుతున్నారు. లేదంటే ప్రాణాలు వదులుతున్నారు. కుటుంబానికి జీవనాధారమైన ఇంటి పెద్ద ఇలా అర్ధంతరంగా మంచం పట్టడమో, ప్రాణాలొదలడమో జరుగుతుండడంతో ఆ కుటుంబమంతా వీధిన పడుతుంది. చదివించే స్థోమత లేక కూలి పనులతో మరింత పేదరికం అనుభవిస్తున్నారు. కొంత మంది పిల్లలు చెడు అలవాట్లకు లోనవుతున్నారు. తిరిగి తేరుకొనే పరిస్థితులు ఉండడం లేదు. ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా కొన్ని రకాల చికిత్సలకు మాత్రమే వైద్యం అందుబాటులో ఉంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి అత్యవసర చికిత్సకు అవకాశం ఉండడం లేదు. ఆన్‌లైన్ జరిగేటప్పటికి రెండు, మూడు రోజులు పడుతుంది. సమయానికి వైద్యం అందకుంటే ఎక్కడ ప్రాణం పోతుందోనని చేతిలో ఉన్న డబ్బుతో పాటు అప్పు చేసి ఖర్చుచేయాల్సి రావడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా చతికల పడుతున్నాయి. వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు అత్యధికం. వీరంతా ఏదైన రోగ మొస్తే ఆసుపత్రుల ఖర్చు చూసి మనోవేదనతో సగం చచ్చిపోతున్నారు. మానసికంగా కుంగిపోవడంతో ఆ కుటుంబాలకు మరింత వైద్యఖర్చులు పెరుగుతున్నాయి. ప్రతి పది మందిలో ముగ్గురి నుంచి నలుగురు షుగర్, బీపీల్లో ఏదో ఒక వ్యాధితో బాధపడుతున్నారు. ఈ రెండు వ్యాధులు ఉన్న వారు తరచూ వివిధ రకాల పరీక్షలు చేసుకోవాలి. లేదంటే పక్షవాతం, కిడ్నీ సంబంధిత వ్యాధుల బారినపడతారు. గుండెపోటుకు గురవుతారు. ప్రతి గ్రామంలోనూ ఒకటి నుంచి పది మంది క్యాన్సర్ రోగులు ఉన్నారు. వీటికి చికిత్సకు రూ.లక్షల్లో ఖర్చువుతుంది. ఇవన్నీ దీర్ఘకాలిక వ్యాధులు కావడంతో నిత్యం మందులు వాడాల్సి వస్తుంది. ఒకపక్క ఆరోగ్యం బాగోలేక, మరోపక్క పిల్లలకు సరైన విద్యను అందించలేక బెంగతో కొందరు కుషించిపోతున్నారు. ప్రస్తుతం విద్యకు ప్రాధాన్యత పెరిగింది. విద్యతోనే మెరుగైన జీవనం పొందవచ్చునన్న వాస్తవాన్ని అంతా తెలుసుకున్నారు. దీంతో తల్లిదండ్రులు ఎన్ని ఇబ్బందులకు గురైనా తమ పిల్లలను ఉన్నతంగా చదివించేందుకు తాపత్రయపడుతుంటారు. పిల్లల చదవుకయ్యే ఖర్చు సంపాదించాలంటే ఆరోగ్యంగా ఉండాలన్న భావన ప్రతి ఒక్కరిలో పెరిగింది. దీంతో చిన్నపాటి అనారోగ్యం అనిపించిన వైద్యులను సంప్రదిస్తున్నారు. అందుకే ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులన్న తేడా లేకుండా రోగులతో కిటకిటలాడుతున్నాయి. సంపాదించిన దాంట్లో సగం ఆసుపత్రులకు పోస్తున్నారు. ఈ పరిస్థితిని తప్పించే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుంది. అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు రూ.25లక్షల ఆరోగ్య బీమాను వర్తింప చేస్తుంది. ఎన్టీఆర్ వైద్య సేవల పరిధిలోకి తీసుకొస్తుంది. ఆసుపత్రిలో చేరిన ఆరుగంటల లోపే యూనివర్సల్ హెల్త్ పాలసీ అమల్లోకి వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. మోసాలకు పాల్పడే ఆసుపత్రులపై పీఎంజేఏవై కేంద్ర ప్రభుత్వ యాంటీ ఫ్రాడ్ ప్రోగ్రామ్ ద్వారా గుర్తించనున్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా పథకం అమలు తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఎన్టీఆర్ వైద్య సేవల ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు జరుగుతుంది. ఇలా ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడం ద్వారా ప్రజలందరికీ ఆరోగ్య భరోసా కల్పించనున్నారు.



రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

●మందుల కొరత లేకుండా చూడాలి ● సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్



వైద్యులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్

పాలకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని పాలకొండ సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ వైద్యులకు ఆదేశించారు. ఏరియా ఆసుపత్రిని శుక్రవారం ఆయన సందర్శించారు. రోగులతో స్వయంగా మాట్లాడి వారికి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి శానిటేషన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. రక్తనిల్వల కొరత ఉందని వైద్యులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ నెల 15న రక్తదాన శిబిరం ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

చేయి చేయి కలిపారు.. గుంతలను పూడ్చారు



గుంతను పూడుస్తున్న యువకులు

పాలకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాలకొండ-సీతంపేట రహదారిలో ఇటీవల కురిసిన వర్షాలకు భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానిక యువకులు స్పందించారు. శుక్రవారం రహదారి వెంబడి గోతులను రాళ్లతో పూడ్చారు. ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు యువత చేసిన ప్రయత్నాన్ని పలువురు ప్రశంసించారు.

యూరియా సరఫరాపై ముఖ్యమంత్రికి నివేదిక

భోగాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా సరఫరాకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. గురువారం రాత్రి ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి రాష్ట్రంలో యూరి యా సరఫరాపై నివేదిక అందజేశానని ఆయన చెప్పారు. అలాగే నెల్లిమర్ల నియోజక వర్గ సమస్యలను వివరించానని తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్య వివరిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

వైభవంగా వసంత పూజోత్సవాలు

సాలూరు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలు శనివారంతో పూర్తికానుండడంతో శుక్రవారం రాత్రి సాలూరులోని పలు వినాయక మండపాల్లో వసంత పూజోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆదివారం చంద్రగ్రహణం ఉండడంతో వినాయక ఉత్సవాలను శనివారంతో ముగింపు పలకాల్సి ఉంది. ఇప్పటికే పలు గణనాథులు గంగమ్మఒడికి చేరాయి. సాలూరులో శుక్రవారం రాత్రి 14 చోట్ల వినాయక ఉత్సవాలకు స్వస్తి పలికి నిమజ్జనోత్సవాలను నిర్వహించారు. పట్టణంలో మిగిలిన గణనాథులను శనివారం భక్తులు నిమజ్జనం చేయనున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

వినాయక నిమజ్జనం వేళ జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. డీజే సౌండ్‌లకు దూరంగా ఉండాలి. నృత్యాలు చేసినప్పుడు అలసటగా ఉంటే దాన్ని ఆపివేసి కూర్చోవాలి. బాణసంచా కాల్చినప్పుడు దూరంగా ఉండాలి. చెరువులు, నదిలో విగ్రహాలను నిమజ్జనం చేసినప్పుడు ఈత రానివారు దిగవద్దు.



సాలూరు డబ్బివీధి నార్త్ ఏరియా గణనాథుని వద్ద వసంత పూజోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గణపతి లడ్డూ వేలం



లడ్డూ వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

చీపురుపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లావేరు రోడ్డులో వరసిద్ధి వినాయక సేవా కమిటీ ఆధ్వర్యంలో గణపతికి నైవేద్యంగా పెట్టిన తాపేశ్వరం లడ్డూ వేలం పాట శుక్రవారం జరిగింది. తెలుగుదేశం పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు గవిడి నాగరాజు అధ్వర్యంలో కమిటీ సభ్యులు 51 కిలోల లడ్డూని వేలం వేయగా పట్టణానికి చెందిన సూరు ఉమాశంకర్ అనే భక్తుడు రూ.51,116కు దక్కించుకున్నారు. అనంతరం ఈ లడ్డూ ప్రసాదాన్ని మేలతాళాలతో ఉమాశంకర్ నివాసానికి తరలించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి..

భామిని, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భామిని ఎస్టీ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. మండపంలో గణనాథునికి ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనానికి తరలించారు. మహిళలు ఆట పాట లతో ఊరేగింపు చేసి, లివిరి వద్ద వంశధార నదిలో నిమజ్జనం చేపట్టారు.

● రాజాం రూరల్: పట్టణంలోని సంపత్‌భవన్‌లో ఏర్పాటు చేసిన పది అడుగుల సంపత్ వినాయకుడి మట్టి విగ్రహంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస, పెను బాక, బొద్దాం, కంచరాం తదితర గ్రామాల్లోని గణనాథుడి విగ్రహాల నిమజ్జనోత్స వాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశారు.



భామిని: ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం, వంశధార నదిలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న యువత



రాజాం రూరల్: సంపత్ వినాయకుడి ఊరేగింపు

ఆకట్టుకున్న నృత్యాలు, బండ్ల వేషాలు

పాలకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏలాం వినాయకుడి శోభాయాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తప్పెటగుళ్లు, కోలాటం, సాముగరిడీలు, శక్తి వేషాలు, కోయ, అఘోరా, సవర తదితర నృత్యాలు ఎంతగానో అలరించాయి. బండ్ల వేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శ్రీకృష్ణుడు, దుర్గాదేవి, భేతాళుడు, షిర్డీసాయి, శివపార్వతులతో పాటు పలు దేవతామూర్తుల అలంకరణలో ఏర్పాటు చేసిన బండ్ల వేషాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.



కోలాటం, తప్పెటగుళ్ల ప్రదర్శన

కరెన్సీ నోట్లతో అలంకరణ

భోగాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పోలిపల్లి గ్రామంలో వినాయక నవరాత్రులు సందడిగా జరుగుతున్నాయి. గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నాయుడోరి వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహానికి శుక్రవారం రూ.1.50లక్షల విలువ గల కరెన్సీ నోట్లతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.




అందరికీ దక్కని ఎరువు



ఎల్.కోట: గనివాడ రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం రైతుల పడిగాపులు

లక్కవరపుకోట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యో తి): గనివాడ గ్రామంలో శుక్రవారం పంపిణీ చేసిన యూరియా కోసం వివిధ గ్రామాల రైతులు పోటెత్తారు. అయితే అసలైన రైతులకు యూరియా దక్కలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీకి చెందిన ఎంపీపీ గేదెల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా ఇవ్వలేకపోయిందని విమర్శించారు.

గరివిడి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వెదుళ్లవలస గ్రామంలో శుక్రవారం పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేశారు. ఈ పంచాయతీకి సుమారు 2వేల యూరియా బస్తాలు అవసరం కాగా, మొదటి విడతగా 260 బస్తాలు మాత్రమే వచ్చాయి. సుమారుగా 500 మంది రైతులు శుక్రవారం ఉదయానికే పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. యూరియా దొరకని రైతులు తీవ్ర అసంతృప్తికి లోనై ఇంటికి తిరుగుముఖం పట్టాల్సి వచ్చింది. త్వరలోనే రెండో విడతలో యూరియా పంపిణీ చేస్తామని వ్యవసాయ అధికారులు తెలిపారు.



గరివిడి: వెదుళ్లవలసలో..

ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ ఫలితాల్లో సాయి ప్రతిభ


సాయి

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్- 2025 పరీక్షా ఫలితాల్లో విజయనగరంలోని ప్రభుత్వ ఐటీఐలో చదివిన ఎర్లా సాయి అనే విద్యార్థి సీనియర్ ఎలక్ట్రీషియన్ విభాగం లో 600కు గాను 600 మార్కులు పొంది జాతీయ స్థాయిలో మొదటి స్థానం సాధించాడు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ టీవీ గిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఎలక్ట్రీషియన్ విభాగంలో 590 మార్కులు దాటి ఆరుగురు విద్యార్థులు, అలాగే జూనియర్ ఎలక్ట్రీషియన్ విభాగంలో ఇద్దరు విద్యార్థులు ఫలితాలు సాధించినట్టు చెప్పారు. అలాగే సీనియర్ ఎలక్ట్రీషియన్స్‌లో శ్రీరామ్ సందీప్, రఘునంద్, ప్రణీత్, జైకిరణ్, సాయిచైతన్యలు, జూనియర్ ఎలక్ట్రీషియన్లలో చక్రధర్, వరప్రసాద్ విజయం సాధించారని వివరించారు.

జిల్లాకు మూడు కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు

బొబ్బిలి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో మూడు కార్పొరేషన్లకు శుక్రవారం బోర్డు డైరెక్టర్లను నియమించింది. వీటిలో జిల్లాకు మూడు పదవులు కేటాయించారు. ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చీపురుపల్లి నియోజకవర్గానికి చెందిన సురేష్‌కుమార్ సరేపాకని నియమించారు. ఏపీ నగరాలు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నెలిమర్లకు చెందిన పిల్లా సూరిబాబును, ఎస్.కోటకు చెందిన సెనాల నానాజీని డైరెక్టర్లుగా నియమించారు. వీరంతా టీడీపీకి చెందిన వారే.

బంద్‌ను జయప్రదం చేయాలి

భోగాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 17న ఆటోడ్రైవర్లు తలపెట్టిన జిల్లా బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, ఏఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి నారాయణరావు, ఏఐఎస్టీయూ జాయింట్ సెక్రటరీ జి.నారాయణరావు కోరారు. ఈ మేరకు భోగాపురం ఆటోస్టాండ్ వద్ద శుక్రవారం పోస్టర్ విడుదల చేశారు.

పలువురికి సన్మానం

రాజాం సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో స్థానిక వాసవీవనిత శక్తి క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవం, ఈనెల 6న జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు క్లబ్ అధ్యక్షురాలు పొట్నా శ్రీదేవి తెలిపారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు చెందిన వాకచర్ల రాజాను, ఉద్దవోలు హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయిని కుసుమంచి భాగ్యలక్ష్మీని, సీనియర్ పాత్రికేయుడు కేవీఎస్‌కేజీ శర్మను సత్కరించారు. సంఘం ఉపాధ్యక్షురాలు కొల్లూరు అరుణ, కార్యదర్శి రాపాక కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు డాక్టరేట్

రాజాం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మారుతీనగర్‌కు చెందిన బెజ్జిపురపు చంద్రశేఖర్ ఫిజిక్స్ సబ్జెక్టులో చేసిన పరిశోధనకు గాను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. స్థానిక ప్రభుత్వ జూని యర్ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పని చేస్తున్న ఈయన గత ఏడేళ్లుగా ఫిజిక్స్, సైన్స్‌లో పరిశోధనలు చేశారు. ఈయన చేసిన పరిశోధనకుగాను నాగార్జున యూనివర్సిటీ శుక్రవారం పీహెచ్‌డీ పట్టాను అందజేసింది.

ఏడాదిన్నరగా పట్టించుకోవడం లేదు

జామి సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే తమను ఏడాదిన్నరగా పట్టించు కోవడం లేదని టీడీపీ మండల అధ్యక్షుడు లగుడు రవికుమార్ ఆరోపించారు. శుక్రవారం అలమండ గ్రామంలో మండలంలోని 13 పంచాయతీలకు చెందిన టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇక్కడి పార్టీ కేడర్‌ను గుర్తించడం లేదన్నారు. ఎంపీ భరత్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణకు లేఖలు అందిస్తామని ఆయన తెలిపారు. అనంతరం పార్టీ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

గ్రంథాలయం ప్రారంభం

గుర్ల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పోలాయవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన శాఖా గ్రంథాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. పోలాయవలస గ్రామ యువత ఆధ్వర్యంలో నడుస్తున్న హెల్పింగ్ హేండ్స్ సేవా సంస్థ ద్వారా ఏర్పాటుచేసిన ఈ గ్రంథాలయాన్ని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రౌతు సంగంనాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ సభ్యులు, యువత పాల్గొన్నారు.

నేత్ర దానానికి ముందుకు రండి

గరివిడి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేత్ర దానానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ మెంబరు బీవీ గోవిందరాజులు కోరారు. నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరివిడి పట్టణంలో నేత్రదానంపై అవగాహన పత్రాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో గరివిడి కంటి ఆసుపత్రి వైద్యులు సునీల్‌కుమార్ తంగరాజన్, ఆసుపత్రి హైటెక్నీషియన్ రమణసుధాకర్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రేగిడి ఎస్ఐగా బాలకృష్ణ

రేగిడి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రేగిడి మండలం కొత్త ఎస్ఐగా వి.బాలకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై రాగా, ఈయన స్థానంలో పనిచేసిన ఎస్ఐ నీలావతి విజయనగరం ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు.

అద్దె భవనాల్లో ఇంకెన్నాళ్లు?

- చిన్నయ్యపేట ప్రాథమిక పాఠశాలకు భవనం కొరత
- అర్థాంతరంగా నూతన భవన నిర్మాణం

రేగిడి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో బేసిక్ పాఠశాలగా గుర్తించిన చిన్నయ్యపేట ప్రాథమిక పాఠశాలకు భవనం కొరత ఏర్పడింది. ఈ పాఠశాల గత ఏడాదిన్నరగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. గతంలో ఉన్న పాఠశాల భవనం శిథిలావస్థకు చేరటంతో 2021లో అప్పటి అధికారులు ఆ భవనాన్ని నేలమట్టం చేశారు. ఆ తర్వాత ఇక్కడ విద్యార్థుల సంఖ్య తగ్గడంతో కొన్నాళ్లు ఈ పాఠశాలను సంకిలిలో విలీనం చేశారు. గ్రామస్థులు ధర్నా చేయడంతో ఈ పాఠశాలను మళ్లీ కొనసాగించారు. నాటి వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు ఫేజ్1లో ఈ పాఠశాలకు నిధులు మంజూరు కాలేదు. మళ్లీ గ్రామస్థులు పాఠశాల భవనం కోసం రోడ్డెక్కారు.. అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో వైసీపీ ప్రభుత్వం చివరి దశలో నాడు-నేడు ఫేజ్-2లో భాగంగా దాదాపు రూ.25లక్షలతో భవనం మంజూరయ్యింది. అయితే ఏడాదిన్నరలో శ్లాబ్, చిన్నపాటి పనులు మాత్రమే పూర్తి చేశారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు పెండింగ్ ఉన్నట్టు చెబుతున్నారు. అలాగే సమగ్రశిక్ష ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ లోపు ప్రభుత్వం మారిపోవటంతో ఈ భవనం పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి.


అద్దె భవనంలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం


అర్థాంతరంగా ఉన్న పాఠశాల భవన నిర్మాణం

తగ్గిన విద్యార్థుల సంఖ్య

ఈ పాఠశాలకు పక్కా భవనం లేకపోవటంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. గతంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా.. విద్యార్థుల సంఖ్య తగ్గిన కారణంగా ఏకోపాధ్యాయ పాఠశాలగా నడుస్తోంది. గతంలో విద్యార్థుల సంఖ్య 16 ఉండగా ఈ ఏడాది 8 మందికి పడిపోయింది. మరో వైపు అద్దె భవనంలో మౌలిక సౌకర్యాలు వెంటాడుతున్నాయి. దీనిపై సమగ్రశిక్ష అధికారులు ఈ పాఠశాల ప్రగతిపై దృష్టి సారించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం


రాజాం: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

వంగర సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం వంగరలోని శివ్వాం ప్రాథమిక సహకార సొసైటీ అధ్యక్ష కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఎరువుల పంపిణీలో రాజాం ప్రాంత రైతుల నుంచి ఎలాంటి వ్యతిరేకత రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. వంగర, రాజాం, రేగిడికి చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

- రాజాం: శ్యాంపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. సోపేరు గ్రామానికి చెందిన కోటగిరి సూర్యారావుకు రూ.2లక్షలు, రేగిడి మండలం అంబాడ వెంకటాపురం గ్రామానికి చెందిన లావేటి వెంకటరావు రూ.లక్ష 1931 విలువగల చెక్కును అందజేశారు. అనంతరం ఏపీఎస్ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన కోటగిరి నారాయణరావును సత్కరించారు.

ఎరువుల స్వాధీనం

సంతకవిటి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సిరిపురం గ్రామంలోని శ్రీబాలాజీ ఏజెన్సీ ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్, వ్యవసాయ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. విజిలెన్స్ రిజిస్ట్రార్ సీహెచ్ ఎర్రన్నాయుడు, ఎస్ఐ రామారావు, వ్యవసాయ అధికారి యశ్వంత్ కుమార్ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. ఈ దుకాణంలో లైసెన్స్ లేకుండా విక్రయాలు చేస్తున్నట్టు గుర్తించారు. దీంతో దుకాణంలో ఉన్న 830 కిలోల ఎరువులు, 16.5 లీటర్ల నానో ఎరువులు, 13.36 కిలోల పురుగు మందుల ప్యాకెట్లు, 63.71 లీటర్ల పురుగు మందులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తం విలువ రూ.1.11లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ ఎరువులు, పురుగు మందులను సీజ్ చేస్తామని చెప్పారు.

విద్యుత్ శాఖాధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని దాసన్నపేట వద్ద ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ భవనం ప్రాంగణంలో దశాబ్దాల కాలంగా ఎదిగిన వృక్షాలను అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా విద్యుత్ శాఖాధికారులు నరికి వేయడంపై కలెక్టర్ అంబేడ్కర్‌కు ఫిర్యాదు చేసినట్టు ఎస్.కోటకు చెందిన న్యాయవాది, పర్యావరణ కార్యకర్త బొబ్బిలి రామకృష్ణ తెలిపారు. విద్యుత్ శాఖాధికారులు వేప, పనస, సపోటా, బాదం, మామిడి తదితర చెట్లను నిర్ధాక్షణ్యంగా తొలగించారని, దీనిపై విచారించగా.. డీఈ ఆదేశిస్తే తొలగించామని అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారన్నారు. ఏపీ వాల్టా చట్టం-2022 సెక్షన్-3 ప్రకారం అన్ని శాఖలు వస్తాయని అనమతుల్లేకుండా చెట్టు నరకడం సమంజసం కాదన్నారు.

ఒప్పందాలు అమలు చేయాలి

నెల్లిమర్ల, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): జూట్‌మిల్లు యాజమాన్యం కార్మిక శాఖ అధికారుల వద్ద ఫిబ్రవరి 10న చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక జూట్ మిల్లు గేటు వద్ద మాట్లాడారు. మిల్లు లాకౌట్ చేసి 10 నెలలు, మిల్లు తెరిచి 6 నెలలు గడుస్తున్నా జూట్ యాజమాన్యం చేసిన ఒప్పందాలు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే అదితి గజపతిరాజు


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. నగరంలోని పలు డివిజన్లు, మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఆమెకు వినతిపత్రాలు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజాదర్బార్ ద్వారా వస్తున్న వినతులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించనున్నట్టు చెప్పారు. సామాజిక పింఛన్లు, ఇళ్లు, ఇంటి రుణాలకు సంబంధించి ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవలసి ఉన్నందున ఆయా వినతులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశిస్తున్నామన్నారు.

త్రీటౌన్ పోలీసుస్టేషన్ ఏర్పాటు నిర్ణయంపై ఎమ్మెల్యే హర్షం

విజయనగరం క్రైం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల్లో ఒక్కటైన త్రీటౌన్ పోలీసు స్టేషన్ ఏర్పాటు ప్రక్రియకు మార్గం సుగమమం కావడం పట్ల ఎమ్మెల్యే అదితి గజపతి రాజు హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 5న ఆంధ్రజ్యోతిలో కూడా 'విజయనగరంలో త్రీ టౌన్ పోలీసుస్టేషన్' పేరిట ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ కథనంతో పాటు, త్రీ టౌన్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనిత, కొండపల్లి శ్రీనివాస్‌కి రాసిన లేఖలను అదితి గజపతి రాజు సామాజిక మాధ్యమాల ద్వారా సీఎం చంద్రబాబు, రాష్ట్ర మంత్రులకు పోస్ట్ చేసి, ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. త్రీ టౌన్ పోలీసు స్టేషన్ ఏర్పాటు గత పదేళ్లుగా ప్రతిపాదన ఉన్నా, ముందుకు కదల్లేదని, తాజాగా ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చడం పట్ల అదితి గజపతిరాజు హర్షం వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా త్రీటౌన్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించాలని ఈసందర్భంగా ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

108 వాహనం ప్రారంభం


108 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సదుపాయాలతో విజయనగరం జిల్లాలోనే మొట్టమొదటి అంబులెన్స్‌ను కొత్తవలస పీహెచ్‌సీకి మంజూరైందని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. ఈ వాహనాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న 108 వాహనం పాడవ్వడంతో కొత్త అంబులెన్స్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి సీతల్‌వర్మ, 108 వాహన సిబ్బంది, దాసరి సంక్షేమ సంఘం చైర్మన్ పీవీ రత్నాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు కోళ్ల వెంకటరమణ,టీడీపీ మండల అధ్యక్షుడు గొరపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది


విజయనగరం దాసన్నపేట: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం


గజపతినగరం: రక్తదానం చేస్తున్న సాయిసిద్ధార్థ కళాశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని జిల్లా శిష్టకరణం సంఘం అధ్యక్షుడు, బృందావనం అపార్టుమెంటు కమిటీ అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం, సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని గుంటూరు వారు వీధిలోని బృందావన్ అపార్టుమెంటులో 15 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కార్యదర్శి ఎస్‌కేఎం భాషా పాల్గొన్నారు. ప్రతి ఏటా అపార్టుమెంటు కమిటీ ప్రతినిధులతో కలిసి ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు బద్రీనాథ్, ఉపేంద్ర, రవి, మూర్తి, సభ్యులు పాల్గొన్నారు. అలాగే వినాయక చవితి పురస్కరించుకుని అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మెగా రక్తదాన శిబిరం

గజపతినగరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక సాయి సిద్ధార్థ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి బి.మైత్రేయి, కళాశాల చైర్మన్ డా.పెద్దినాయుడు ఆధ్వర్యంలో 81 యూనిట్ల రక్తాన్ని సేకరించి, జిల్లా కేంద్ర ఆసుపత్రికి, స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. కళాశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్ 48వ పర్యాయం రక్తదానం చేశారు. అదేవిధంగా విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి, బహుమతులను ప్రదానం చేశారు. అధ్యాపకులకు నూతన వస్త్రాలతో సత్కరించారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

దత్తిరాజేరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో సీఐ జె.జనార్దనరావు ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గడసాం గ్రామంలో 10 మద్యం సీసాలతో డి.అరుణ అనే వ్యక్తి పట్టుబడగా కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.నరేంద్రకుమార్, కానిస్టేబుళ్లు బి.గంగాధరరావు, వి.అప్పారావు పాల్గొన్నారు. ఇప్పటివరకు 139 మంది బెల్టుషాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి 256.32 లీటర్ల మద్యాన్ని, 6.5 లీటర్ల బీరును స్వాధీం చేసుకున్నట్టు తెలిపారు. ఎంఆర్‌పీ కంటే మద్యాన్ని విక్రయిస్తే 9440902367 నెంబరుకు సమాచారం అందజేయాలని సీఐ కోరారు.

రెవెన్యూ యంత్రాంగం కుట్ర చేస్తోంది

- కొనసాగుతున్న జిందాల్ నిర్వాసితుల నిరసన



నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): బొడ్డవర గ్రామంలో గత 74 రోజులుగా శాంతియుతంగా పోరాటం చేస్తున్న జిందాల్ నిర్వాసితులపై మండల రెవెన్యూ యంత్రాంగం కుట్ర చేస్తోందని జిందాల్ నిర్వాసితులు ఆరోపించారు. శుక్రవారం బొడ్డవర గ్రామంలో నిర్వహించిన నిరసనలో వారు మాట్లాడారు. కొద్ది రోజుల కిందట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు 216 దరఖాస్తులు ఇచ్చామని.. అయితే 198 అని చెబుతున్నారని అన్నారు. మండల రెవెన్యూ యంత్రాంగం ఎవరి మెప్పు కోసం తప్పుడు నివేదికలు పంపిస్తుందో చెప్పాలన్నారు. ఈ రిపోర్టులు చూస్తుంటే తమకు మండల రెవెన్యూ అధికారులపై అనుమానాలు వస్తున్నాయని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు.

గ్రామసభలు నిర్వహించాలి

మండలంలోని బొడ్డవర, కిల్తంపాలెం, ముషిడిపల్లి ప్రాంతాల్లో ఉన్న జిందాల్ భూముల్లో ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తామని చెప్పడం శుభపరిణామం.. అయితే దీనికి సంబంధించి ముందుగా గ్రామసభలు నిర్వహిస్తే బాగుంటుందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. శుక్రవారం ఆయన బొడ్డవరలోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. ఇక్కడ ఏర్పాటు చేయబోయే పరిశ్రమలు, వాటి వల్ల ఉపయోగాలపై తెలియజేయాలన్నారు. అలాగే గతంలో భూములు పోయిన వారికి ఉద్యోగ, ఆర్థిక భద్రత వంటి వాటిపై భరోసా నింపాల న్నారు. అయితే పరిశ్రమల ఏర్పాటు కారణంగా తమ ప్రాంతంలో కాలుష్యం పెరుగుతుందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారని అన్నారు.

అన్న హత్య

- నలుగురిలో అవమానిస్తున్నాడని కక్షగట్టిన తమ్ముడు
- నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి

గజపతినగరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సొంత అన్న ఎప్పటికప్పుడు పదిమందిలో తనను అవమానపరుస్తూ.. కించపరుస్తున్నట్టు భావించిన తమ్ముడు కక్షగట్టాడు. సమయం కోసం చూశాడు. మరొకరి సాయంతో దారికాచి అంతమొందించాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్తబగ్గాం గ్రామానికి చెందిన అన్నదమ్ములైన పసుపురెడ్డి శ్రీను, చంటి కుటుంబాలతో జీవనం సాగిస్తున్నారు. కొన్నాళ్ల కిందట వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 2న పసుపురెడ్డి శ్రీను, జి.బాషా గ్రామానికి సమీపంలో మద్యం షాపువద్ద మద్యం సేవిస్తున్నారు. అక్కడకు చంటి, మరో వ్యక్తి రామచంద్రుడు వెళ్లారు. మద్యం సేవించిన తరువాత చంటి ఇంటికి వెళ్లిపోయాడు. రామచంద్రుడు అక్కడే ఉన్నాడు. ఆ సమయంలో శ్రీను, రామచంద్రుడి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. శ్రీనును అంతమొందించాలని భావించిన రామచంద్రుడు అదే కోపంతో చంటి వద్దకు వెళ్లాడు. 'మీ అన్నయ్యను చంపేద్దామని' చెప్పాడు. అప్పటికే శ్రీనుపై కోపంతో ఉన్న తమ్ముడు చంటి అందుకు అంగీకరించి ఇంట్లో ఉన్న కోడి కత్తెను తీసుకొని బయలుదేరారు. ఇద్దరూ గ్రామంలోకి వచ్చే దారిలో ఓ చోట కాపుకాసారు. అంతలో ఆటుగా ద్విచక్రవాహనంపై వస్తున్న శ్రీను, భాషాలను అడ్డుకున్నారు. బండి తాళం తీసుకుని శ్రీనుపై ఇద్దరూ దాడి చేశారు. కత్తితో తీవ్రంగా గాయపరిచారు. ప్రాణాలు పోయినట్టు నిర్ధారించుకున్నాక కాలువలోకి నెట్టేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. నిందితులను శుక్రవారం మెంటాడ రైల్వేగేటు వద్ద పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యపై పసుపురెడ్డి శ్రీను భార్య జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విలేకరుల సమావేశంలో సీఐ రమణ, ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జనంలో అపశృతి

- చెరువులో మునిగి వ్యక్తి మృతి

నెల్లిమర్ల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతిచెందారు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. అలుగోలు గ్రామానికి చెందిన పంచాది గణపతి(45) అనే వ్యక్తి గురువారం రాత్రి వినాయక నిమజ్జనానికి గుండాల చెరువుకు వెళ్లారు. నిమజ్జనానికి ముందు గణపతి తన సెల్‌ఫోన్‌ను కెల్ల నీలాకుమార్ అనే యువకుడికి ఇచ్చారు. అనంతరం ఆయన అందరితో కలిసి నిమజ్జనానికి చెరువులోకి వెళ్లారు. నిమజ్జనం అనంతరం అందరూ ఇంటికి వెళ్లిపోయారు. గణపతి సెల్‌ఫోన్‌ను ఇచ్చేందుకు నీలాకుమార్ తన ఇంటికి వెళ్లగా.. కుటుంబ సభ్యులు ఇంకా రాలేదని చెప్పారు. దీంతో నీలాకుమార్ వెంటనే నిమజ్జనం చేసిన చెరువు వద్దకు వెళ్లగా, అక్కడ మృతదేహం కనిపించింది. మృతుడు గణపతి ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్నారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ బి.గణేష్ పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నిమజ్జనానికి వెళ్లి వస్తుండగా..

- గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

బొండపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనానికి వెళ్లి తిరిగి రిక్షాతో వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. దీనిపై ఎస్ఐ యు.మహేష్ శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గజపతినగరం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సీర నాగరాజు(42) రిక్షా పుల్లర్‌గా జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి ఆయన తన రిక్షాపై వినాయక నిమజ్జనానికి పోలీసుస్టేషన్ సమీపంలో ఉన్న రామన్న చెరువుకు వెళ్లారు. తిరిగి రిక్షాలో స్వగ్రామం వెళ్తుండగా బొండపల్లి పోలీసు స్టేషన్‌కు సమీపంలోకి వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రున్ని 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం మృతిచెందారు. మృతునికి భార్య గౌరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతి

బొండపల్లి, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): బొండపల్లి, గరుగుబిల్లి రైల్వేస్టేషన్ మధ్య రైలు పట్టాలపై గుర్తుతెలియని యువకుడు మృతిచెందినట్టు బొబ్బిలి రైల్వే పోలీసు స్టేషన్ హెచ్‌సీ బి.ఈశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 30 ఏళ్ల వయస్సుకలిగి.. పసుపు రంగు టీషర్టు, నలుపు రంగు ప్యాంటు కలిగిఉన్న యువకుడి మృతదేహాన్ని పోలీసులు పట్టాలపై గుర్తించామని చెప్పారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించామన్నారు. పూర్తి సమాచారం కోసం విజయనగరం రైల్వే ఎస్ఐ బాలాజీరావును 9490617089, 9491813163 నెంబర్లకు సంప్రదించాంచాలని కోరారు.

చికిత్స పొందుతూ ఒకరు..

చీపురుపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి పట్టణానికి చెందిన మాజీ విలేకరి నాదెళ్ల శ్రీనివాసరావు(42) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. గత నెల 29 పట్టణంలోని ఆంజనేయపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసరావు తలకు తీవ్ర గాయమయ్యింది. చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఆయనను విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం మృతి చెందారు.

కుక్కకాటుతో బాలుడికి గాయాలు

కొత్తవలస, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొత్తవలస పంచాయతీ మిందివలస రామచంద్రపురానికి చెందిన ప్రమోద్ అనే బాలుడిని శుక్రవారం పిచ్చికుక్క కాటువేసింది. దీంతో ఆ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తల్లిదండ్రులు కొత్తవలస పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి పెందుర్తిలో మరో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి బాగానే ఉంది.

ఉపాధ్యాయ వృత్తిలో గొప్ప సంతృప్తి

(5వ పేజీ తరువాయి)

అన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ.. గతంలో ఉపాధ్యాయులకు ఎటువంటి గౌరవం ఉందో, ప్రస్తుతం ఎటువంటి గౌరవం ప్రభుత్వం అందిస్తుందో వారు తెలుసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ గురించి గొప్పగా చెప్పుకొనే విధంగా విద్యా వ్యవస్థలో తమ ప్రభుత్వం మార్పులు తీసుకొస్తున్నట్టు తెలిపారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతం మారుమూల ప్రాంతం అయినప్పటికీ మట్టిలో మాణిక్యాలు తీసే విధంగా పదో తరగతి పరీక్షల్లో జిల్లా మూడు పర్యాయాలు రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించే విధంగా ఉపాధ్యాయులు చేసిన కృషి మరువలేనిదన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన సర్వేలో విద్యార్థులకు అందిస్తున్న విద్యా ప్రమాణాలు, బోధనలు, మౌలిక వసతుల కల్పనలో జిల్లా పదో స్థానంలో ఉందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అవకాశం ఉన్నవారు దత్తత తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో రూపొందించిన బాల వెలుగు మాసపత్రికను మంత్రి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, కలెక్టర్ ఆవిష్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు జ్ఞాపికను అందించి దుశ్శాలువలతో సత్కరించారు. వివిధ పాఠశాలలు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, సర్వశిక్షా ఏపీసీటీ తేజేశ్వరరావు పాల్గొన్నారు.

కొండను కొల్లగొట్టి.. ప్రజారోగ్యాన్ని గుల్లచేసి!

(5వ పేజీ తరువాయి)

పెద్దల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

● వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ కాలంలో బడిదేవరకొండ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అది రెవెన్యూ ప్రాంతంగా మారింది. అయితే ఎన్నికల ఫలితాల తర్వాత కూడా నాటి కోర్టు ఆదేశాలు చూపుతూ బడిదేవరకొండ వద్ద గ్రానైట్ తవ్వకాలు చేపడు తున్నారు. కొండపై తవ్వకాలతో తెల్లని పొడి సమీప చెరువులు, పంట పొలాల్లోకి చేరుతుంది. దీంతో గాలి, నీరు కలుషితమవుతుండగా... తరచూ ఈ ప్రాంతవాసులు రోగాల బారిన పడుతున్నారు. వెలగవలస వద్ద ఉన్న చెరువు గ్రానైట్ బూడిదతో నిండిపోవడంతో ఇటీవల చేపల వేటకు వెళ్లిన బంగారి దొర అనే గిరిజనుడు అందులో జారిపడి మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబం రోడ్డున పడింది.

● సుమారు 40 గ్రామాల ప్రజలు ఆరాధ్య దైవంగా పూజించే బడిదేవరమ్మ కొలువైన కొండపై తవ్వకాలు ఆపాలని ఆ ప్రాంతవాసులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల వారికి పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కూడా మద్దతు తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిన తర్వాతే తవ్వకాలు చేపట్టాలన్నారు. మరోవైపు స్థానిక గిరిజనులు, కూటమి నాయకులు, వామపక్షాలు, ఇతర గిరిజన, ప్రజా సంఘాలు దీనిపై నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా.. పరిస్థితిలో మార్పు రావడం లేదు. బడిదేవర కొండపై యథేచ్ఛగా తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు. దీనిపై పార్వతీపురం ఫారెస్ట్ రేంజర్ రామ్ నరేష్‌ను వివరణ కోరగా.. 'న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు ఇక్కడి నుంచి పత్రాలు పంపించాం. ప్రభుత్వ న్యాయవాది వద్ద అవి ఉన్నాయి.' అని తెలిపారు.

ఇది తగునా?

(5వ పేజీ తరువాయి)

విద్యార్థికి 100 గ్రాముల చికెన్ కూర అందించాల్సి ఉంది. కానీ, చాలా పాఠశాలల్లో 30 గ్రాములు(రెండు ముక్కలు) వడ్డించి చేతులు దులుపుకొంటున్నారు. మరికొన్ని పాఠశాలల్లో ఉడకపెట్టిన కోడిగుడ్లు ఇవ్వడం లేదు. సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ మెనూలో కోత విధిస్తుండడంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు.

కానరాని పర్యవేక్షణ..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 47 ఆశ్రమ పాఠశాలలు, 12 గురుకులాలు, 18 పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో 16 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. సీతంపేట ఏటీడబ్ల్యూవో పోస్టు ఖాళీగా ఉండడంతో ఆ బాధ్యతలను కూడా డీడీ అన్నదొర పర్యవేక్షిస్తున్నారు. మెళియాపుట్టి రెగ్యులర్ ఏటీడబ్ల్యూవో ఇటీవల బదిలీపై వెళ్లిపోవడంతో ఆ బాధ్యతలను లాబర పాఠశాల హెచ్‌ఎం సూర్యనారాయణకు అప్పగించారు. రెండు ఏటీడబ్ల్యూవో పోస్టుల్లో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో గిరిజన పాఠశాలలపై పర్యవేక్షణ కరువైంది.

● గిరిజన సంక్షేమశాఖ అధికారులపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఆశ్రమ, గురుకుల, పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలల వార్డెన్లు నెలకు ఒక్కో విద్యార్థిపై రూ.20చొప్పున ఆయా శాఖ అధికారులకు నెలవారీ మామూళ్లు అందిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే పాఠశాలలపై పర్యవేక్షణ ఉండడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఇటీవల కాలంలో ఇష్టానుసారంగా ఉపాధ్యాయులకు డెప్యుటేషన్‌లకు అవకాశం కల్పించారనే అభియోగాలు ఉన్నాయి. దీంతో పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఏర్పడి గిరిజన విద్యార్థుల చదువులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. గతంలోనూ ఈశాఖ అధికారులపై అనేక ఆరోపణలు వెలుగుచూశాయి. అవి ఇంకా విచారణ దశలోనే ఉన్నాయి.

నిఘా పెడతాం..

ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంచుతున్నాం. పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులతో ఎటువంటి పనులు చేయించడం లేదని సిబ్బంది చెబుతున్నారు. విద్యార్థులతో పనులు చేయిస్తున్న పాఠశాలలపై ప్రత్యేక నిఘా పెడతాం.

- అన్నదొర, డీడీ, గిరిజన సంక్షేమశాఖ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడం, నిర్వహణ పనులను దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11 కెవి నవగాం పరిధిలో ఉండే గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ కె.విష్ణుమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. తుమరాడ, భాసూరు, ఎం.సింగుపురం, బడ్డుమాసంగి, గోపాలపురం, ఓని, వాటపాగు, అట్టలి, చిన్నమంగళాపురం, గొట్ట మంగళాపురం, పనుకువలస, బెజ్జి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

శిక్షకురాలికి సత్కారం

గరుగుబిల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కుట్టు శిక్షణ కేంద్రంలోని శిక్షకురాలు పెద్దింటి ప్రసన్నకుమారిని గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని తొలి విడత శిక్ష మహిళలు ఆమెను శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో బోను రత్నకుమారి, బి.వరలక్ష్మి, షేక్ హసీనా, ఎం.రాధ, బి.స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కాజ్‌వేలు



చిట్టగెడ్డ వద్ద కాజ్‌వే దుస్థితి



విజయరామపురం వద్ద కోతకు గురైన కాజ్‌వే

మక్కువ రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గ్రామాలకు వెళ్లే కాజ్‌వేలు అధ్వానంగా ఉన్నాయి. వాటిపై నుంచి ప్రయాణించడం భయం గొల్పుతోంది. వంతెనలు నిర్మించాల్సిన చోట చోట కాజ్‌వేలు నిర్మించడం వల్ల అవి మరమ్మతులకు గురయ్యాయి. గిరిజనుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. మార్కొండపుట్టి నుంచి నంద గిరిజన గ్రామానికి వెళ్లే రహదారిలో చిట్టగెడ్డపై నిర్మించిన కాజ్‌వే దాదాపు శిథిలరూపు దాల్చింది. ఈ కాజ్‌వేపై మీదుగా రాకపోకలు సాగిస్తున్న మక్కువ, సాలూరు మండలాలకు చెందిన 20 గ్రామాల గిరిజనులకు కష్టాలు తప్పడంలేదు. కాజ్‌వే మధ్యలో గోతులు, రంధ్రాలు పడ్డాయి. పైగా రెండువైపులా రక్షణ కోసం ఏర్పాటు చేసిన స్థంబాలు కూడా ధ్వంసమయ్యాయి.

అలాగే విజయరామపురం-అనసభద్ర గ్రామాల మధ్య నిర్మించిన కాజ్‌వే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాటైంది. కాజ్‌వేలో కొంత భాగం వరద తాకిడికి కోతకు గురైంది. దానివల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు గ్రామాల ప్రజలే కాకుండా డి.కె.పట్నం పంచాయతీలోని వివిధ గ్రామాల ప్రజలు దీని మీదుగానే మక్కువమండల కేంద్రానికి వెళ్తుంటారు. దీనికి కనీస మరమ్మతులు చేపట్టకుంటే పూర్తిగా పాడయ్యే అవకాశం ఉంది. ఇకనైనా కాజ్‌వేల మరమ్మతులకు పాలకులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

మహ్మద్ ప్రవక్త ఆలోచనలు స్ఫూర్తిదాయకం



ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి



కురుపాంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

సాలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): మహ్మద్ ప్రవక్త మిలాద్ ఉన్ నబి జయంతి సందర్భంగా పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహ్మద్ ప్రవక్త బోధనలను స్థానిక ముస్లింలు స్మరించుకున్నారు. అనంతరం మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త ఆలోచనలు, మానవతా విలువలు, సత్యం, ప్రేమ, శాంతి సూత్రాలు ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. సమాజంలో ఐకమత్యం, సౌభ్రాతృత్వం, మత సహనం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముస్లింలు మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని సత్కరించారు.

● కురుపాం, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివ్వన్నపేటలోని జామీయ మసీదులో శుక్రవారం మహ్మద్ ప్రవక్త ఈద్ మిలాద్ ఉన్ నబి జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మత గురువు దల్ మహమ్మద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను వివరించారు. అనంతరం మసీదు నుంచి కురుపాం పురవీధుల్లోల ముస్లింలు ర్యాలీ నిర్వహించారు.

పండగలో స్వల్ప వివాదం



ఘర్షణ పడుతున్న ముస్లింలు

సాలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త మిలాద్ ఉన్ నబి జయంతి పండగలో స్వల్ప వివాదం చోటుచేసుకుంది. పట్టణంలో కోటవీధి సమీపంలోని మసీదులో ముస్లింలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మసీదులో ప్రార్ధనలు చేశారు. తదుపరి కొంతమంది ముస్లింలు ప్రస్తుత కమిటీ సభ్యుల తీరు సరిగాలేదని ఆరోపించారు. మసీదుకు వస్తున్న డబ్బులు పక్కదారి పట్టిస్తున్నారని, ఖర్చులు లెక్క చెప్పడం లేదని వాగ్వాదానికి దిగారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. పట్టణ సీఐ అప్పలనాయుడు హుటాహుటిన మసీదుకు చేరుకుని ఇరువర్గాల సభ్యులకు నచ్చజెప్పారు. అనంతరం సీఐ మాట్లాడుతూ కమిటీ ఏర్పాటు, నిర్వహణ, కమిటీ చేసే పనులు, కమిటీకి వచ్చే నిధులు, కమిటీ చేయాల్సిన విధులు అన్నింటికి సంబంధించి ముస్లిం మతపెద్దలతో పాటు కమిటీ సభ్యులు, వ్యతిరేక వర్గీయులు బైలా తీసుకుని మంగళవారం స్టేషన్‌కు రావాలని సూచించారు. అప్పటివరకు ఎలాంటి ఘర్షణలు పడవద్దన్నారు. ఘర్షణకు కారణమైనవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అక్కడ పరిస్థితులు చక్కబడటంతో సీఐ వెనుదిరిగారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శు క్రవారం గుమ్మలక్ష్మీపురంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి వినతిపత్రాలను అందజేశారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆమె ఆదేశించారు.

ఏఎస్పీ ఆకస్మిక పరిశీలన



మాట్లాడుతున్న ఏఎస్పీ అంకితా సురాన

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీసుస్టేషన్‌ను ఏఎస్పీ అంకిత సురాన శుక్రవారం ఆకస్మిక పరిశీలన చేశారు. ఎస్ఐ జగదీశ్‌నాయుడుతో మాట్లాడారు. ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ నిబద్ధత పాటించాలన్నారు. గంజాయి, సారా, నిషేధిత పదార్థాలపై నిఘా పెంచాలన్నారు.

రేపు ఆలయాల మూసివేత



తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం

గరుగుబిల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధి గాంచిన తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాలను ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా మూసివేయనున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం ఆలయాలల్లో సంప్రోక్షణ అనంతరం స్వామి దర్శనానికి భక్తులకు అవకాశం కలిస్తామన్నారు.

అంతర పంటల సాగుకు కృషి చేయండి



కొత్తగూడలో ప్రకృతి సాగును పరిశీలిస్తున్న డీపీఎం

భామిని, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంతర పంటలు సాగుకు రైతులు ప్రాధాన్యమివ్వాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ శ్రావణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం బురుజోల, కొత్తగూడల్లో సేంద్రియ ఎరువుతో సాగు చేస్తున్న రైతు పంట పొలాలను ఆయన సందర్శించారు. అంతర పంటల వల్ల చీడపీడలు సోకే అవకాశం ఉండదన్నారు. తక్కువ మదుపుతో ఆశించిన దిగుబడి పొందే వీలు ఉంటుందని అవగాహన కల్పించారు.

అన్నా క్యాంటీన్లలో రుచికర భోజనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బెలగాం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌లో రూ.5 లకే నాణ్యమైన, రుచికర భోజనం అందిస్తున్నామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే పార్వతీపురంలోని అన్నా క్యాంటీన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. భోజనం ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పేదల ఆకలి తీర్చడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేశారన్నారు. అతి తక్కువ ధరకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు.

ఐటీడీఏ బంక్‌లో ఆయిల్ కొరత



సీతంపేటలోని పెట్రోల్ బంక్

సీతంపేట రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ ఆధ్వర్యంలోని సీతంపేటలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో ఆయిల్ కొరత తరచూ వేధిస్తోంది. గడచిన రెండు రోజులుగా సీతంపేట పెట్రోల్ బంక్‌లో ఆయిల్ కొరత నెలకొంది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఇక్కడ బంక్ నుంచి అధిక ఆదాయం సమకూరుతున్నప్పటికీ నిర్వహణ లోపం వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. ఇకనైనా అధికారులు పెట్రోల్ బంక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యను ఏపీవో చిన్నబాబు దృష్టికి తీసుకువెళ్లగా.. హెచ్‌పీసీఎల్ నుండి పెట్రోల్ ట్యాంకర్ ఇవాళ వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

సందడిగా గణేశ నిమజ్జనోత్సవం

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తవలస పెద్దవీధిలో ఏర్పాటు చేసిన మండలంలోని వినాయకుడికి శుక్రవారం సాయంత్రం నిమజ్జనోత్సవాన్ని సందడిగా నిర్వహించారు. యువత కేరింతలు, డ్యాన్సుల నడుమ ఊరేగింపు జరిగింది. సాయంత్రం లడ్డూ వేలం పాట నిర్వహించారు. అలాగే తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు బహుమతులను అందజేశారు.

ప్రైవేట్ భాగస్వామ్యం వద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

బెలగాం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణంలో ప్రైవేట్ భాగస్వామ్య నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకుడు లు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన చేపడుతోందని ఆరోపించారు. భవిష్యత్‌లో ప్రభుత్వ వైద్యరంగాన్ని ప్రైవేటీకరించేలా టీడీపీ క్యాబినెట్ నిర్ణయం ఉందన్నారు. జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాల నిర్మాణం ప్రభుత్వ హయాంలోనే జరగాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొల్లి గంగునాయుడు, ఎస్.వై.నాయుడు, రెడ్డి వేణు, కొల్లి సాంబమూర్తి, రెడ్డి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మిశ్రమ పంటల సాగుకు ఆసక్తి

సీతానగరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంటలకు గిట్టుబాటు లేకపోవడం, పెరుగుతున్న పెట్టుబడులు నేపథ్యంలో రైతులు మిశ్రమ పంటలు సాగుకు మొగ్గు చూపుతున్నారు ఆయిల్‌పామ్ తోటల పెంపకం మడుల్లో మిశ్రమ పంటగా పత్తి, మొక్కజొన్న, అరటి, నువ్వు పంటలను సాగు చేస్తున్నారు. తామరఖండి, గెడ్డలుప్పి, బళ్లకృష్ణాపురం, దయానిధిపురం, చినంకలాం, జానుమల్లువలస, అప్పయ్యపేట, అంటిపేట, వెంకటాపురం గ్రామాల్లో సుమారు 250 ఎకరాల విస్తీర్ణంలో మిశ్రమ పంటలను రైతులు సాగుచేస్తున్నారు. అలాగే 150 ఎకరాల విస్తీర్ణంలో చోడి, కూరగాయల పంటలు పండిస్తున్నారు. ఆయిల్‌పామ్ గెలలు కోతకు వచ్చినంతవరకు ఇతర ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి మిశ్రమ పంటలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

పాలకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై పాలకొండ అగ్నిమాపకశాఖ అధికారి సర్వేశ్వరరావు అవగాహన కల్పించారు. శుక్రవారం పట్టణంలోని మోర్ సూపర్ మార్కెట్‌లో సిబ్బంది, ప్రజలకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సీతానగరంలో అన్నసమారాధన

సీతానగరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం ఆవరణలో శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు. కేబుల్ నెట్‌వర్క్ ప్రతినిధి చెలికాని వెంకట గోపాలకృష్ణ, కార్యదర్శి కన్నారావు పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. మండలంలోని పెదభోగిలి, సీతానగరం, అప్పయ్యపేట, బుడ్డిపేట, లక్ష్మీపురం, చినభోగిలి, అనంతరాయుడుపేట గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అన్నప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.హరి గోపాలరావు, అరవింద్‌కుమార్, ఎస్.ప్రసాద్, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాయుడువలసలో...

● రామభద్రపురం, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): నాయుడువలసలో ఏర్పాటు చేసిన వినాయక మండపం ఆవరణలో శుక్రవారం పూజా నిర్వాహకులు అన్న సమారామాధన నిర్వహించారు. కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షుడు జేసి రాజు భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామస్థులు ఆయన్ని సత్కరించారు.

డా. సర్వేపల్లికి ఘన నివాళి



పాలకొండ: సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



అధ్యాపకులను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వేమూరి హరగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విజయనగరం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి శివ్వాల తవిటినాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శంకరరావు, గోవిందరావు, శివ, నాగభూషణరావు, అన్నపూర్ణమ్మ, వెలమట అప్పారావు, సాధు చం ద్రరావు తదితరులు సన్మానించారు.

● స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల విశ్రాంత గ్రంథాలయాధికారి డాక్టర్ కె.చౌదరినాయుడు, విశ్రాంత సీనియర్ అసిస్టెంట్ వై.డి.ప్రసాద్, అధ్యాపక బృందంతో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఉపాధ్యాయుడికి, విద్యార్థికి ఉన్న గొప్ప సంబంధాన్ని వివరించారు. అనంతరం అధ్యాపకులకు విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, అధ్యాపకులు కూన శ్రీనివాసరావు, ఎం.శాంతి, పల్లా రాజ్యలక్ష్మి, ఆమంచి శ్రీనివాసరావు, జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● వీరఘట్టం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో శు క్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 13 మందిని ఎంఈవోలు గౌరునాయుడు, ఆనందరావు సత్కరించారు.